సాక్షి అనకాపల్లి

మంగళవారం ၊ 18 ၊ జూన్ ၊ 2024



కమనీయం.. కల్యాణం 8లో

కశింకోటలోని వేంకటేశ్వరస్వామి ధ్యాన మందిరంలో సోమవారం శ్రీవారి వార్షిక కల్యాణోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు.



హైవేపై రైలింజన్

విశాఖ: తాళ్లవలస హైవేపై ఒక భారీ ట్రాలర్ నిలిచిపోయింది. ఇది తమిళనాడు నుంచి కోల్‌కత్తా వైపు రైలింజన్ తీసుకెళ్తోంది.



సేఫ్టీ కోర్సుల్లో ప్రాక్టికల్స్

విశాఖ: ప్రభుత్వ కెమికల్ ఇంజినీరింగ్ ఇన్‌స్టిట్యూట్‌లో సేఫ్టీ కోర్సుల విద్యార్థులకు ప్రాక్టికల్స్ నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ తెలిపారు.

న్యూస్‌రీల్


పాలిటెక్నిక్ కళాశాలలో దరఖాస్తుల స్వీకరణ



రాజీవ్‌గాంధీ పాలిటెక్నిక్ కళాశాలలో ప్రవేశ దరఖాస్తు అందజేస్తున్న ప్రిన్సిపాల్ శివ

కశింకోట: కశింకోటలోని ఏపీఈపీడీసీఎల్ (పూర్వ ఆర్‌ఈసీఎస్) సబ్ డివిజన్ కార్యాలయంలో ఉన్న రాజీవ్‌గాంధీ పాలిటెక్నిక్ కళాశాలలో విద్యుత్ వినియోగదారుల, ఉద్యోగుల పిల్లల 50 శాతం కోటా కింద ప్రవేశానికి దరఖాస్తుల విక్రయం ప్రారంభమైంది. మెకానిక్, ఈసీఈ, ఈఈఈ, సివిల్ బ్రాంచ్‌లలో ప్రవేశానికి సోమవారం నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నామని ప్రిన్సిపాల్ కె.శివ తెలిపారు. పూర్వ ఆర్‌ఈసీఎస్ పరిధిలోని ఆసక్తి కలిగిన విద్యార్థులు అవసరమైన పత్రాలు, ఫొటోలు జత చేసి కళాశాల కార్యాలయంలో దరఖాస్తులు అందజేయాలన్నారు. వివరాలకు 9063297220, 9505504220, 0892 4220377 నంబర్లను సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ గణేష్, ఆఫీస్ సూపరింటెండెంట్ కె.శివరాం తదితరులు పాల్గొన్నారు.

పెరుగుతున్న 'కోనాం' నీటిమట్టం



కోనాం జలాశయం

చీడికాడ: మండలంలోని కోనాం జలాశయం నీటిమట్టం రోజురోజుకూ పెరుగుతోంది. ఇటీవల కురుస్తున్న వర్షాలతో జలాశయంలోకి ఇన్‌ఫ్లో పెరగడంతో ప్రస్తుతం 95.60 మీటర్ల వద్దకు చేరుకుంది. గతేడాది ఇదే తేదీన 95.20 మీటర్ల వద్ద ఉండేది. రైతులు ఖరీఫ్ వరి సాగుకు నారుమడుల తయారీలో బిజీగా ఉన్నారు. జలాశయం పూర్తి స్థాయి నీటిమట్టం 101.25 మీటర్లు. ప్రస్తుతం ఎగువ దిగువ కాలువల ద్వారా 60 క్యూసెక్కుల నీరు విడుదలవుతోంది. ఇన్‌ఫ్లో 30 క్యూసెక్కుల వరకు ఉంది.

పోర్టు ప్రగతి భేష్



పోర్టు చైర్మన్ అంగముత్తుతో మాట్లాడుతున్న జీవీఎల్ నరసింహారావు

మహారాణిపేట (విశాఖ): కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో నడుస్తున్న 12 ప్రధాన ఓడరేవుల్లో ఒకటైన విశాఖ పోర్టు అథారిటీ అత్యుత్తమ పనితీరును కనబరచడం విశాఖకే గర్వకారణమని, కీలకమైన పనితీరు ద్వారా గ్లోబల్ ర్యాంకింగ్స్‌లో గణనీయమైన మెరుగుదలకు కారణమైన పోర్టు చైర్మన్ డాక్టర్ ఎం.అంగముత్తు, తక్కువ కాలంలోనే ఇంతటి అద్భుతమైన పనితీరు కనబరిచిన అధికారులకు అభినందనలు తెలియజేస్తున్నానని బీజేపీ సీనియర్ నేత, మాజీ రాజ్యసభ సభ్యుడు జీవీఎల్ నరసింహారావు అన్నారు. సోమవారం పోర్టు చైర్మన్‌తో జీవీఎల్ భేటీ అయ్యారు. తాజా గ్లోబల్ ర్యాంకింగ్స్‌లో విశాఖ పోర్టు 19,20 స్థానాలు పొందడంపై ఆయన అభినందనలు తెలిపారు.

శభాష్ రైతన్న



బాధిత మహిళకు బంగారం చైను అప్పగిస్తున్న రైతు బజార్ ఈఓ కొండబాబు

సీతమ్మధార (విశాఖ): స్థానిక సీతమ్మధార రైతుబజార్‌లో ఓ మహిళ బంగారం పోగొట్టుకుంది. దొండపర్తి దరి టీఎస్ఎన్ కాలనీకి చెందిన పి.కనకదుర్గాదేవి ఆదివారం ఉదయం సీతమ్మధార రైతుబజార్‌కు వచ్చింది. ఆమె మెడలోని నల్లపూసల బంగారం చైను తెగిపోయింది. ఏడు గ్రాముల బరువు గల చైను పోయిందని ఆమె రైతుబజార్ సిబ్బందికి ఫిర్యాదు చేసింది. బజారు సిబ్బంది మైకులో సదరు సమాచారం ప్రకటించారు. దీంతో కొత్తపాలేనికి చెందిన రైతు అప్పారావు తనకు దొరికిన చైనును సిబ్బందికి అందజేశారు. అనంతరం రైతుబజార్ ఎస్టేట్ ఆఫీసర్ కొండబాబు బాధితురాలికి చైను అందజేశారు. ఆయన వెంట రైతుబజార్ అటెండర్ సతీష్, రైతులు ఇతర సిబ్బంది ఉన్నారు. గంగారం పోగొట్టుకున్న కనకదుర్గ జబర్దస్త్ ఫేం భాస్కర్ సోదరి. తనకు చైను అందజేసిన రైతు, బజారు సిబ్బందికి ఆమె కృతజ్ఞతలు తెలిపారు.





కశింకోట: బక్రీద్ విశిష్టతను వివరిస్తున్న ఇమాం రెహమాన్



కోటవురట్ల: మసీదులో నమాజ్ చేస్తున్న ముస్లింలు

త్యాగానికి ప్రతీక బక్రీద్

త్యాగానికి ప్రతీక అయిన బక్రీద్ పండగను సోమవారం ముస్లింలు ఘనంగా నిర్వహించారు. నూతన వస్త్రాలు ధరించి కుటుంబ సమేతంగా మసీదుకు వెళ్లి ప్రార్థనలు చేశారు. పరస్పరం ఆలింగనం చేసుకుంటూ బంధువులు, స్నేహితులకు శుభాకాంక్షలు తెలుపుకున్నారు. కశింకోటలోని పురాతన జామియా మసీదు, నూరి మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఇమాం జెడ్ రెహమాన్ బక్రీద్ పండగ విశిష్టతను తెలియజేశారు. ఇస్మాయిల్ త్యాగానికి ప్రతీకగా పండగను జరుపుకుంటారన్నారు. కోటవురట్ల ముస్లిం కాలనీలో మజీద్ ఉస్మాన్ ఘనీ కమిటీ, నవజవాన్ యూత్ ఆధ్వర్యంలో వేడుకలను నిర్వహించారు. రోలుగుంట, నిండుగొండ మసీదుల్లో, మునగపాక బైపాస్ రోడ్డును ఆనుకొని ఉన్న ఆల్ నూర్ మసీదులో ప్రార్థనలు చేశారు. యలమంచిలి రెహమత్ యూత్ ఆధ్వర్యంలో జామియా మసీదులో బక్రీద్ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. –సాక్షి న్యూస్ నెట్‌వర్క్

మునగపాక: బక్రీద్ శుభాకాంక్షలు తెలుపుకుంటున్న చిన్నారులు



ఆత్మీయ కరచాలనం



విశాఖ పాతనగరం కోటవీధి గ్రౌండ్లో నిర్వహించిన బక్రీద్ నమాజ్‌లో పాల్గొన్న ముస్లింలు

ముదముతో కొలిచేము మోదకొండమ్మా..

- నేడు మాడుగుల మోదకొండమ్మ జాతర
- ఏర్పాట్లు పూర్తి చేసిన ఆలయ కమిటీ
- విద్యుత్ దీపాలంకరణలో మాడుగుల పట్టణం
- ప్రత్యేక అలంకరణలో అమ్మవారు





మాడుగుల మోదకొండమ్మ ఆలయం



విద్యుత్ దీపాలంకరణతో మాడుగుల పట్టణం

మాడుగుల: మన్యం దేవత, ఈ ప్రాంత ఇలవేల్పు, మాడుగుల మోదకొండమ్మ జాతర మంగళవారం నిర్వహించేందుకు ఆలయ కమిటీ అన్ని ఏర్పాట్లు చేసింది. అమ్మవారి పండగను ఏటా అత్యంత వైభవంగా నిర్వహించడం పరిపాటి. భారీ సంఖ్యలో భక్తులు తరలి వచ్చి అమ్మవారిని దర్శించుకుని, మొక్కులు చెల్లించుకుంటారు. ఈ ఏడాది కూడా భారీగా భక్తులు వచ్చే అవకాశాలుండటంతో జాతరను ఘనంగా నిర్వహించేందుకు కమిటీ ప్రతినిధులు పూర్తిస్థాయి ఏర్పాట్లు చేశారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందుల్లేకుండా సౌకర్యాలు కల్పించారు. గ్రామం, పట్టణ పరిధిలో వీధుల్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు. అమ్మవారి ఆలయం నుంచి సతకంపట్టు వరకు, చోడవరం రోడ్డులో వేంకటేశ్వర స్వామి ఆలయం వరకు, మోదమాంబ కాలనీ దాసరి వీధి, జగ్గన్నచావిడి, పురవీధుల్లో భారీ విద్యుత్ దీపాలంకరణ, సెట్టింగ్‌లు ఏర్పాటు చేశారు. ప్రధాన కూడళ్లలో భారీ విద్యుత్ కటౌట్లు పెట్టారు. జాతర సందర్భంగా ఆర్టీసీ యంత్రాంగం ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేసింది.

సాంస్కృతిక కార్యక్రమాలు

జాతర సందర్భంగా వేర్వేరు చోట్ల పలు సాంస్కృతిక కార్యక్రమాలకు ఏర్పాట్లు చేశారు. సతకంపట్టు వద్ద డ్యాన్స్ హంగామా, ఎన్టీఆర్ స్టేజ్ దుర్గాలమ్మ ఆలయం వద్ద జబర్దస్త్ కళాకారులు, జీఆర్ ఈవెంట్స్ సారథ్యంలో డ్యాన్స్–2024, దసరా స్టేజీ మీద వీరాభిమన్యు బుర్రకథ, భక్త చింతామణి పౌరాణిక నాటకం, శ్రీ కృష్ణ రాయబారం పద్య నాటకం, జగ్గన్న చావిడి వద్ద డ్యాన్స్ బేబీ డ్యాన్స్ నిర్వహించనున్నారు. గవరవీధి, నెయ్యిలవీధి, అంబేడ్కర్ కాలనీ సమీపంలో డ్యాన్స్ మస్తీ, జవ్వాది గెడ్డ దేవరాపల్లి శ్రీను ఇంటి వద్ద సినీ నృత్య ప్రదర్శన, రావిచెట్టు జంక్షన్ వద్ద డ్యాన్స్ ఉత్సవ్, ఎంపీడీవో కార్యాలయం వద్ద సూపర్ డూపర్ డ్యాన్స్, సతకంపట్టు వద్ద ప్రాచీన కళ తోలుబొమ్మలాటలు ఏర్పాటు చేస్తున్నారు. వీటితో పాటు గరగల నృత్యం, బిందెల డ్యాన్స్ తదితర సంప్రదాయ కార్యక్రమాలు జరగనున్నాయి. దాతల సహకారంతో ప్రసాద వితరణ, మజ్జిగ, గ్లూకోజ్ వాటర్ పంపిణీకి ఏర్పాట్లు పూర్తి చేశారు.

తీపి ఎక్కువైతే చేదే..

- ఈనెల 12 నుంచి 18 వరకు జాతీయ మధుమేహ వారోత్సవాలు
- పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ ఆధ్వర్యంలో ప్రజలకు అవగాహన



సాక్షి, అనకాపల్లి: తీపి అంటే అందరికీ ఇష్టమే. కానీ ఆ తీపి శరీరంలో ఎక్కువైతే జీవితం చేదుగా మారుతుంది. మధుమేహ వ్యాధి అనేది మనిషిని తీవ్రమైన మానసిక ఆందోళనకు గురిచేస్తుంది. మధుమేహం ఒకప్పుడు పెద్దలకు మాత్రమే వచ్చేది. కానీ ప్రస్తుతం చిన్నా.. పెద్దా అనే తేడా లేకుండా అందరిలో ఈ సమస్య కనిపిస్తోంది. నిండా 30 ఏళ్లు లేపోయినా మధుమేహ సమస్యతో ఇబ్బందులు పడుతున్నారు. జిల్లాలో కూడా మధుమేహ వ్యాధిగ్రస్తులు పెరుగుతూనే ఉన్నారు. గత ప్రభుత్వంలో ఫ్యామిలీ డాక్టర్ , జగనన్న ఆరోగ్య సురక్ష లాంటి హెల్త్ డ్రైవ్‌ల ద్వారా గ్రామాల్లో మధుమేహ రోగులకు వైద్యసేవలు, మందులు అందిస్తూ వ్యాధి నియంత్రణలో ఉండేలా కృషి చేశారు. జిల్లాలో ఈనెల 12వ తేదీ నుంచి 18 తేదీ వరకు జాతీయ మధుమేహ వారోత్సవాలు నిర్వహిస్తున్నారు. పీహెచ్‌సీ వైద్యులు గ్రామాల్లో మధుమేహ రోగులకు అవగాహన కల్పిస్తున్నారు.

జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రుల్లో చికిత్స తీసుకుంటున్న మధుమేహ వ్యాధిగ్రస్తులు 1.5 లక్షల మేర ఉన్నట్టు అంచనా. ఇందులో 90 శాతం మేరకు టైప్–2 రకం మధుమేహం రోగులే ఉన్నారు. వీరిలో 90 వేల మంది రోగులకు ప్రభుత్వ ఆస్పత్రుల ద్వారా మధుమేహ పరీక్షలు చేసి మందులు సరఫరా చేస్తున్నారు. ప్రస్తుత కాలంలో డయాబెటిస్ సమస్య అందరిలోనూ కనిపిస్తోందని, రోజువారీ జీవనశైలి, ఆహారనియమాలు పాటించడం ద్వారా ఈ వ్యాధిని నియంత్రణలో పెట్టవచ్చని నర్సీపట్నం ఏరియా ఆస్పత్రి వైద్యుడు ఎస్.మల్లికార్జున చెప్పారు. ఆకుపచ్చ, ఆకుకూరలు మధుమేహ రోగులకు ప్రయోజనకరంగా ఉంటాయన్నారు. తృణధాన్యాలు, బ్రౌన్ రైస్, తాజా కూరగాయలు, తాజా పండ్లు, బీన్స్ తింటే మంచిదన్నారు. దాల్చిన చెక్క, సొరకాయ, కాకరకాయ, మెంతులు, ఆకుకూరలు, జొన్నలు, రాగులు వంటి చిరుధాన్యాలు తీసుకోవడం ద్వారా డయాబెటిస్‌ను అదుపులో ఉంచుకోవచ్చన్నారు.

వాల్తేరు దూకుడు

- ఈస్ట్‌కోస్ట్ రైల్వే జోన్‌లో అత్యధిక ఆదాయార్జన
- 2023–24లో రూ.546 కోట్ల ఆదాయంతో టాప్–1గా నిలిచిన విశాఖ
- రూ.493 కోట్లతో ద్వితీయ స్థానంలో జోన్ ప్రధాన కేంద్రం భువనేశ్వర్ స్టేషన్
- విశాఖ స్టేషన్ నుంచి 2,77,11,147 మంది ప్రయాణికుల రాకపోకలు



విశాఖ సిటీ: వాల్తేరు డివిజన్ పరుగులు పెడుతోంది. ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేరుస్తూ.. ఆదాయంలో సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్‌లా దూసుకుపోతోంది. తూర్పు కోస్తా రైల్వే జోన్ ప్రధాన కేంద్రం భువనేశ్వర్ స్టేషన్‌ను సైతం వెనక్కు నెట్టి ఆదాయార్జనలో విశాఖ స్టేషన్ ముందుంది. 2023–24 ఆర్థిక సంవత్సరంలో రూ.546.14 కోట్లు ఆర్జించింది. జోన్ ప్రధాన కేంద్రం భువనేశ్వర్ స్టేషన్ రూ.493 కోట్లతో ద్వితీయ స్థానంతో సరిపెట్టుకోవాల్సి వచ్చింది. అలాగే ప్రయాణికులను గమ్యస్థానాలను చేర్చడంలోను ప్రథమ స్థానంలో నిలిచింది. విశాఖ రైల్వేస్టేషన్ నుంచి 2,77,11,147 మంది ప్రయాణికులు రాకపోకలు సాగించారు.

ఈస్ట్‌కోస్ట్ ఆదాయంలో సింహభాగం వాల్తేరుదే..

ఈస్ట్‌కోస్ట్ రైల్వే జోన్‌కు వాల్తేరు డివిజన్ బంగారు బాతులా మారింది. అతి పెద్దదైన ఈ డివిజన్ పరిధిలో ఏటా 2.5 కోట్లకు పైగా ప్రయాణికులు రాకపోకలు సాగిస్తున్నారు. తూర్పు కోస్తా రైల్వే జోన్‌కు ఏటా సుమారు రూ.14 వేల కోట్ల వరకు ఆదాయం వస్తుండగా.. ఇందులో రూ.5 వేల కోట్ల నుంచి రూ.7 వేల కోట్ల వరకు ఒక్క వాల్తేరు డివిజన్ నుంచే వస్తోంది. అతి పెద్ద లోకో షెడ్, భారీ ఎలక్ట్రికల్ లోకోషెడ్, విశాలమైన మార్షలింగ్ యార్డు కూడా ఇక్కడే ఉన్నాయి. డివిజన్ ఆదాయంలో సింహభాగం ఐరెన్ ఓర్ రవాణా జరిగే కేకే లైన్, మొదలైన ప్రధాన మార్గాల ద్వారానే వస్తుంటుంది. రైల్వేస్టేషన్ ఆధునీకీకరణతో పాటు వాణిజ్య ఆదాయం పెంపుపై దృష్టి పెట్టడంతో ఆ దిశగా కూడా వాల్తేరుకు భారీగా ఆదాయం సమకూరుతోంది.

రాకపోకల్లోనూ పరుగులు

2023, ఏప్రిల్ 1వ తేదీ నుంచి 2024, మార్చి 31వ తేదీ వరకు విశాఖపట్నం రైల్వే స్టేషన్ ప్యాసింజర్ రిజర్వేషన్ సిస్టమ్(పీఆర్ఎస్) ద్వారా 478.28 కోట్లు రాగా.. అన్‌రిజర్వ్‌డ్ టికెటింగ్ సిస్టమ్(యూటీఎస్) ద్వారా రూ.67.86 కోట్లు వచ్చింది. మొత్తంగా విశాఖ రైల్వేస్టేషన్ నుంచి రూ.546.14 కోట్లు ఆదాయం లభించింది. అలాగే భువనేశ్వర్ స్టేషన్‌కు రూ.493.01 కోట్లు, ఆ తరువాత స్థానాలలో పూరీ స్టేషన్‌కు రూ.276.55 కోట్లు, బ్రహ్మపూర్ రైల్వేస్టేషన్‌కు రూ.101.94 కోట్లు ఆదాయం వచ్చింది. అదే విధంగా ప్రయాణికుల రాకపోకల విషయంలో కూడా విశాఖ స్టేషన్ ప్రథమ స్థానంలో నిలిచింది. ఇక్కడి నుంచి 2,77,11,147 మంది రాకపోకలు సాగించారు. భువనేశ్వర్ స్టేషన్ ద్వారా 2,63,46,444 మంది ప్రయాణాలు చేశారు. ఇలా ఆదాయార్జనలోనే కాకుండా ప్రయాణికుల రాకపోకల విషయంలో కూడా విశాఖ సత్తా చాటుతోంది.

సింహగిరి.. ఆధ్యాత్మిక ఝరి

- అప్పన్నకు వైభవంగా ఆర్జిత సేవలు
- తరలి వచ్చిన భక్తులు



సహస్ర నామార్చన చేస్తున్న అర్చకుడు

సింహాచలం: సింహగిరికి భక్తులు పోటెత్తారు. ఆధ్యాత్మిక చింతనలో మునిగి తేలారు. అప్పన్న ఆర్జిత సేవల్లో పాల్గొని తరించారు. అనంతరం స్వామిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి సోమవారం ఆర్జిత సేవలు వైభవంగా నిర్వహించారు. ఉదయం 9.30 గంటల నుంచి నిత్యకల్యాణం వైభవంగా చేశారు. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను ఆలయ ఆస్థాన మండపంలోని వేదికపై అధిష్ఠింపజేశారు. విష్వక్సేనపూజ,పుణ్యాహవచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణం నేత్ర పర్వంగా నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి ప్రసాదం,శేష వస్త్రాలు అందజేశారు.

- శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి సహస్రనామార్చన ఘనంగా జరిగింది. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను బేడామండపంలోని వేదికపై అధిష్ఠింపజేసి 1001 నామాలు పఠిస్తూ స్వామికి తులసితో అర్చన చేశారు.
- సింహాచలేశుడికి గరుడసేవ వైభవంగా జరిగింది. ఆలయ బేడామండపంలో స్వామివారి ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని వెండి గరుడవాహనంపై వేంచేయజేసి అష్టోత్తరశతనామావళి పూజ చేశారు. విశేషంగా హారతులు అందజేశారు.పూజలో పాల్గొన్న భక్తులను గరుడవాహనం చుట్టూ ప్రదక్షిణ చేయించారు.



గరుడసేవ నిర్వహిస్తున్న అర్చకులు



నిత్యకల్యాణంలో పాల్గొన్న ఉభయదాతలు

శరవేగంగా 'తండేల్'





నటీనటులు సాయి పల్లవి, నాగచైతన్య

కొమ్మాది (విశాఖ): గీతా ఆర్ట్స్ బ్యానర్‌పై చందు మొండేటి దర్శకత్వంలో తండేల్ చిత్ర షూటింగ్ శరవేగంగా సాగుతోంది. సోమవారం నగరంలో మంగమారిపేటబీచ్, ఫిషింగ్ హార్బర్ ప్రాంతాల్లో చిత్ర హీరో అక్కినేని నాగచైతన్య, హీరోయిన్ సాయిపల్లవిపై కొన్ని కీలక సన్నివేశాలు చిత్రీకరించారు. మత్స్యకార బ్యాక్‌గ్రౌండ్‌తో ఈ చిత్రం రూపుదిద్దుకుంటోంది. అందుకే మత్స్యకార గ్రామాల్లో షూటింగ్ నిర్వహిస్తున్నారు. నాగచైతన్య హీరోగా చందు మొండేటి దర్శకత్వం వహిస్తున్న మూడో చిత్రమిది. అదే విధంగా సాయి పల్లవి, నాగచైతన్య కలిసి నటిస్తున్న రెండో సినిమా. బన్ని వాసు నిర్మిస్తున్న ఈ చిత్రానికి దేవిశ్రీ ప్రసాద్ సంగీతం అందిస్తున్నారు. ఇప్పటికే 75 శాతం సినిమా చిత్రీకరణ పూర్తయిందని చిత్ర యూనిట్ తెలిపింది. సినిమా షూటింగ్ చూసేందుకు ఉప్పాడ, మంగమారిపేట, భీమిలి, రుషికొండ తదితర ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో అభిమానులు ఇక్కడకు చేరుకున్నారు.

జల'యోగ'ం



జలయోగ చేస్తున్న గీతా శ్రీకాంత్

బీచ్‌రోడ్డు (విశాఖ): ధనురాసనం, శవాసనం, కూర్మాసనం.. ఇవన్నీ యోగాలోని ఆసనాలు. నిత్యం నేలపై చేసే ఈ ఆసనాలను నీటిలో వేశారు శ్రీకాకుళం జిల్లాకు చెందిన యార్లగడ్డ గీత శ్రీకాంత్. అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని సోమవారం నగరంలోని ఓ హోటల్‌లోని స్విమ్మింగ్ పూల్‌లో సోమవారం ఆమె వివిధ ఆసనాలను ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ యోగ చేయడం వలన మనిషి ఆరోగ్యంగా ఉండటంతో పాటు మనస్సు ప్రశాంతంగా ఉంటుందని గీత శ్రీకాంత్ అన్నారు. యోగా గొప్పతనం ప్రజలకు తెలిపేందుకు ఈ కార్యక్రమం నిర్వహించినట్టు చెప్పారు. పిల్లల నుంచి వృద్ధుల వరకు జల యోగా చేస్తే ఆరోగ్యవంతులుగా ఉంటారన్నారు.

అప్పన్న సన్నిధిలో సంగీత దర్శకుడు రవిశంకర్



కప్పస్తంభానికి మొక్కుకుంటున్న రవిశంకర్

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామిని సోమవారం సినీ సంగీత దర్శకుడు రవిశంకర్ దర్శించుకున్నారు. ఆలయంలోని కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకున్నారు. ఆయన పేరిట అర్చకులు స్వామికి పూజలు నిర్వహించి స్వామివారి ప్రసాదం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 2008లో ప్రియమణి, శరత్ కుమార్,కృష్ణంరాజు ప్రధాన పాత్రల్లో విడుదలైన చండీ సినిమా ద్వారా సంగీత దర్శకుడిగా పరిచయం అయినట్టు తెలిపారు. బాలీవుడ్‌లో అమితాబచ్చన్ నటించిన సర్కార్-3, తెలుగులో నాగార్జున హీరోగా విడుదలైన ఆఫీసర్ సినిమాతో పాటు కోలీవుడ్‌లో డాక్టర్ శివరాజ్‌కుమార్‌తో కిల్లింగ్ వీరప్పన్ అనే సినిమాకు సంగీత డైరెక్టర్‌గా పనిచేశానన్నారు. ప్రస్తుతం ప్యాన్ ఇండియా మూవీగా వస్తున్న రామజన్మభూమి, వరదరాజుగోవిందం అనే సినిమాకు సంగీతం సమకూర్చినట్టు తెలిపారు.

తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి
(రెవెన్యూ సెక్షన్, తిరుపతి)
Roc. No.REV-1-TTD- 47022(32)/36/2024, Dt: 15.06.2024
తిరుమల తిరుపతి దేవస్థానములకు చెందిన వ్యవసాయ భూములు శ్రీ వేంకటేశ్వర స్వామి దేవాలయము, ఉపమాక గ్రామము, నక్కపల్లి మండలం, విశాఖపట్నం జిల్లా నందలి విస్తీర్ణం ఎ.71.08 సెంట్లు కలిగిన భూములు కౌలుకై మూడు (03) సంవత్సరములకు ఇవ్వడానికి నిర్ణయించారు. ఆసక్తి యున్నవారి నుండి సీల్డు టెండర్ ఆహ్వానించబడునది. టెండర్ సహిత వేలం తేది: 04.07.2024 ఉ॥ 11.00 గం.లకు స్థలము శ్రీ వేంకటేశ్వర స్వామి దేవాలయము, తిరుమల తిరుపతి దేవస్థానములు, ఉపమాక గ్రామము నందు టెండర్ ఆహ్వానించబడునది. వివరముల కొరకు తిరుమల తిరుపతి దేవస్థానములు, అధికారిక వెబ్‌సైట్ https: www.tirumala.org లేదా ఫోన్ నెం.0877-2264240 పై సంప్రదించగలరు.
Roc No:TTD-40021(31)/1/2024-PRO SEC(Adv No.32) Dt: 17.06.2024 కార్యనిర్వహణాధికారి

సాక్షి ఉద్యోగ అవకాశాలు

SUDHAKAR
PIPES & FITTINGS / WIRES & CABLES
Plot No.C-18, Door No: 38-22-77, Industrial Estate, Kapparada, Visakhapatnam-530007
Career Opportunities
Join Our Team!
We are one of the leading manufacturers of pipes and fittings, seeking dynamic and experienced professionals to fill the following positions:
1. Sales Executives (Local Market & Projects)
i) 2-3 years of relevant experience in sales
ii) Proven track record of meeting sales targets
iii) Excellent communication and interpersonal skills
2. Project Managers
i) 5-6 years of experience in managing projects
ii) Proven experience in the pipes and fittings industry
iii) Strong leadership and project management skills
If you are a motivated and results-driven individual, please send your bio-data to: Email: hr.sma@sudhakarind.com
vizag@sudhakarpipes.com | Ph: 98486 22903
We offer a competitive salary and benefits package. Join our team and be a part of our growth story !

సాక్షి క్లాసిఫైడ్స్

Education

TUTION CENTRE
■ క్రిస్టియన్ ట్యూషన్ సెంటర్ ఫ్రీ ఎడ్యుకేషన్ : LKG to 7th Class, Telugu & English Mediem. మధురవాడ పరిసర ప్రాంతాలవారికి మాత్రమే. ఫోన్ కాల్ చేసి పేర్లు నమోదు చేసుకున్న మొదటి 50 మంది విద్యార్థులకు మాత్రమే అవకాశం. ఇట్లు ఎం.మోజెస్, సెల్: 90108 78841, పాత మధురవాడ, విశాఖపట్నం-48. [V- 776853]

Real Estate
■ VJA, మంగళగిరి, బెంజిసర్కిల్‌కి 5 కి.మీ. బందరు రోడ్డు, గన్నవరం, నున్న నూజివీడు రోడ్డులో కంచికచర్ల దగ్గర ఇళ్ళ మధ్యలో ఇళ్ళ ప్లాట్స్ చ॥గ॥ 1,900/- నుండి 18,500/- సంప్ర: ✆ 63028 55524 [B-23]

Services
ఆల్కలైన్ వాటర్
■ ఆల్కలైన్ వాటర్ ఎందుకు త్రాగాలి? శరీరంలోని విష పదార్థలను తొలగించి తక్షణ శక్తినిచ్చి రోగ నిరోధక శక్తిని పెంచును. ఫోన్: 93931 20181. [V- 12034]

GOLD LOANS
■ లోకేష్ గోల్డ్ లోన్స్ :- బ్యాంక్/ప్రైవేట్ తాకట్టులో ఉన్న బంగారాన్ని విడిపించి అదే రోజు మార్కెట్ రేటుకు కొనబడును. సంప్ర :- 98484 88068/ 77992 23300 [V- 12047]

Wanted
■ Wanted Computer teacher 1st to 8th Classes. Contact: Won World School, 4-47-7, Lawsonsbay Colony, Pedawaltair, Ph: 93920 01001, 98482 37187. [V- 6708]
■ కిరాణా మరియు మెడికల్ స్టోర్స్‌కి చిరుధాన్యాల పౌడర్ మార్కెటింగ్ చేయుటకు Sales Man కావలెను. Qualification : 10+2 దాటి ఉండకూడదు. వయస్సు : 25 సంవత్సరాలు దాటి ఉండకూడదు. Salary : 10,000 (Fixed) +PF+TA, DA, EEBM Udela Pvt Ltd, VSP Cont:9703731155 [C-800294]

సినిమా వార్తల కోసం లాగ్‌ఆన్ అవ్వండి
www.sakshi.com

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

సాక్షి క్లాసిఫైడ్స్ లలితానగర్, అక్కయ్యపాలెం, విశాఖపట్నం - 16.
అనకాపల్లి : 9010546644
యలమంచిలి : 9951602901
చోడవరం : 9010210265
నర్సీపట్నం : 9010234557
పాడేరు : 9010973030
విశాఖపట్నం, అనకాపల్లి + అల్లూరి జిల్లా
నాలుగు లైన్లు రూ.475/-
అదనపు లైను రూ.100/-
+ 5% జి.ఎస్.టి. అదనం

కమనీయం.. శ్రీనివాస కల్యాణం





వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవం (ఇన్‌సెట్) హాజరైన భక్తులు

కశింకోట : స్థానిక వేంకటేశ్వరస్వామి ధ్యాన మందిరంలో సోమవారం రాత్రి శ్రీవారి వార్షిక కల్యాణోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. జ్యేష్ఠ శుద్ధ ఏకాదశి పురస్కరించుకొని శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి ఉత్సవ విగ్రహాలను అందంగా అలంకరించిన వేదికపై నిలిపి శాస్త్రోక్తంగా వేదమంత్రాల నడుమ సామూహికంగా దంపతులు కల్యాణాన్ని జరిపించారు. గణేష్ పూజ, విశ్వక్సేన పూజ, నూతన వస్త్రాల సమర్పణ, యజ్ఞోపవీతనం ధారణ, కన్యాదానం, శుభ ముహూర్తాన జీల కర్ర, బెల్లం పెట్టుట, మాంగళ్య ధారణ, తలంబ్రాలు పోసుకోవడం, కర్పూర దండలు అలంకరణ, బ్రహ్మముడి వేడయం తదితర ఘట్టాల గురించి వివరిస్తూ కల్యాణాన్ని కమనీయంగా నిర్వహించారు. ఏపీ అర్చక ఎగ్జామినర్ రేజేటి శ్రీరామాచార్యులు ఆధ్వర్యంలో వేణుగోపాలస్వామి ఆలయ అర్చకుడు రేజేటి సీతారామాచార్యులు, మారుతి, గోప అప్పలాచార్యులు, ఆలయ అర్చకుడు రేజేటి శ్రీరామచరణాచార్యులు తదితరులు కల్యాణాన్ని జరిపించారు. భక్తులు ఎక్కువ సంఖ్యలో కల్యాణోత్సవానికి హాజరై కనులారా తిలకించి భక్తి పారవశ్యులయ్యారు. కల్యాణం అనంతరం ప్రసాద వితరణ చేశారు.

కడుపునొప్పి తాళలేక మహిళ ఆత్మహత్య

రోలుగుంట : మండలం రాజన్నపేట గ్రామానికి చెందిన కోది సత్యవతి అనే పేద మహిళ కడుపునొప్పితో బాధపడుతూ తట్టుకోలేక పురుగుమందు తాగి సోమవారం మృతి చెందింది. దీనిపై వీఆర్వో శ్రీనివాసరావు ఇచ్చిన సమాచారం మేరకు ఎస్ఐ ఎల్.సురేష్ కేసు నమోదు చేశారు. వివరాలివీ. రాజన్నపేట గ్రామానికి చెందిన కోది సత్యవతి(49) కొన్ని నెలలుగా కడుపునొప్పితో బాధపడుతుంది. వైద్యం చేయించుకోవడానికి డబ్బులు లేక ఇక్కట్లు పడుతుంది. సోమవారం నొప్పి తీవ్రం కావడంతో తట్టుకోలేక సోమవారం మధ్యాహ్నం ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగు మందు తాగి అపస్మారక స్థితికి చేరుకుంది. పొరుగువారు చూసి నర్సీపట్నం ఏరియా ఆస్పత్రికి తరలించగా ఇక్కడ చికిత్స పొందుతూ మృతి చెందింది. ఆస్పత్రి వర్గాల సమాచారం మేరకు ఎస్ఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పైడితల్లమ్మ పండగకు సర్వం సిద్ధం

- అట్టహాసంగా ఏర్పాట్లు
- ఘనంగా తొలేళ్ల ఉత్సవం
- అమ్మవారి జోగి, ఘటాల ఊరేగింపు
- విశేషంగా గంటదీపాల ఉత్సవం



సతకం పట్టువద్ద పైడితల్లి అమ్మవారు



సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి సోదరి, అడవివరం గ్రామదేవత పైడితల్లి అమ్మవారి పండగకు విస్తృత ఏర్పాట్లు చేశారు. మంగళవారం అమ్మవారి పండగను పురస్కరించుకొని సింహాచల దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి ఆధ్వర్యంలో అధికారులు విశేషంగా ఏర్పాట్లు చేశారు. అమ్మవారి ఆలయాన్ని ముస్తాబు చేశారు. భక్తులకు ప్రసాదం, మంచినీరు అందించడంతో పాటు ఎండవేడి తగలకుండా షామియానాలు, టెంట్లు వేశారు. ఆలయ పరిసరాలతో పాటు అమ్మవారి శతకంపట్టు నుంచి పాత గోశాల వరకు పెద్ద ఎత్తున విద్యుత్ దీపాలు ఏర్పాటు చేశారు. మంగళవారం రాత్రి జరిగే అమ్మవారి అనుపు మహోత్సవంలో పులివేషాలు, కాంతారా డ్యాన్స్, కేరళ డ్రమ్స్ ప్రదర్శనలను దేవస్థానం ఏర్పాటు చేసింది. అలాగే గ్రామ సంప్రదాయం ప్రకారం గాంధీనగర్‌లో ఘటాలగుడిగా పేరుగాంచిన అమ్మవారి సతకం పట్టును అలంకరించారు. అమ్మవారి విగ్రహానికి రంగులు వేశారు. అనుపు మహోత్సవానికి పూజారి వంశీయుడు, ఉత్సవ కమిటీ చైర్మన్ లండ వెంకటరమణ ఆధ్వర్యంలో లండ కుటుంబీకులు ఘటాలను సిద్ధం చేశారు.



అమ్మవారి జోగిని గ్రామంలో ఊరేగిస్తున్న దృశ్యం

సాంస్కృతిక కార్యక్రమాల ఏర్పాటు

పైడితల్లి అమ్మవారి పండగను పురస్కరించుకుని మంగళవారం పలు పార్టీల ఆధ్వర్యంలో సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. 98వ వార్డు వైఎస్సార్‌సీపీ వార్డు అధ్యక్షుడు కొలుసు ఈశ్వరరావు, అడవివరం కోఆపరేటివ్ సొసైటీ అధ్యక్షుడు కర్రి అప్పలస్వామి, పార్టీ నాయకులు పీతల అప్పలరాజు, కర్రి సత్తిబాబు, బోర మోహన్ ఆధ్వర్యంలో స్థానిక సింహాచలం ఆర్‌టీసీ కాంప్లెక్స్ ఎదురుగా ఉన్న ప్రాంగణంలో భారీ ఎత్తున వేదిక ఏర్పాటు చేశారు. ఆర్కెస్ట్రా, డ్యాన్స్‌బేబీ డ్యాన్స్, స్పెషల్ డ్యాన్స్ తదితర కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

- దేవస్థానం బస్టాండ్ ప్రాంగణంలో 98వ వార్డు కార్పొరేటర్ పి.వి.నరసింహం ఆధ్వర్యంలో సినీ మ్యూజికల్ నైట్, డ్యాన్స్ ప్రోగ్రాం ఏర్పాటు చేశారు.
- 98వార్డు జనసేన అధ్యక్షుడు మజ్జి సూరిబాబు ఆధ్వర్యంలో బజార్‌లోని ట్యాక్సీస్టాండ్ ప్రాంగణంలో డ్యాన్స్‌బేబీ డ్యాన్స్, రేలారే రేలా కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.
- సతివాడ శంకరరావు ఆధ్వర్యంలో సింహాచలంలోని పుష్కరిణి సత్రం వద్ద ఆర్కెస్ట్రా, సినీ గాయకులచే పాటల విభావరి ఏర్పాటు చేశారు.

ఘనంగా తొలేళ్ల ఉత్సవం

పైడితల్లమ్మ మహోత్సవం పురస్కరించుకొని సోమవారం రాత్రి తొలేళ్ల ఉత్సవం ఘనంగా జరిగింది. గాంధీనగర్‌లోని అమ్మవారి సతకం పట్టు నుంచి ఘటాలను పూజారి వంశస్తులైన లండ కుటుంబసభ్యులు, గ్రామస్తులు ఊరేగించారు. సాయంత్రం గ్రామంలో అమ్మవారి జోగి ఊరేగించి.. రాత్రి పాత అడవివరంలో లండ కుటుంబీకులు గంటదీపాల ఉత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. తొలేళ్ల సందర్భంగా స్థానిక పుష్కరిణి సత్రం వద్ద దేవస్థానం ఏర్పాటు చేసిన స్వరకల్పన ఉత్సాహపరిచింది.అడవివరం ప్రాంతానికి చెందిన గాయకుడు లొడగల రమేష్ తదితరులు పలు పాటలతో ప్రజలను అలరించారు.



సిద్ధం చేసిన ఘటాలు

ఆటోడ్రైవర్‌పై ఇనుప రాడ్డుతో దాడి

- కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ మృతి
- కేసు నమోదు చేసిన ఎస్ఐ సురేష్
- దర్యాప్తు చేస్తున్న అనకాపల్లి డీఎస్పీ ఎస్.అప్పలరాజు



కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ మృతి చెందిన రాంబాబు



మృతుడు రాంబాబు (ఫైల్)

రోలుగుంట : మండలంలో రెండు గ్రామాలకు చెందిన ఇద్దరు వ్యక్తుల మధ్య వాగ్వాదం ఘర్షణకు దారితీసింది. ఈ ఘర్షణలో కె.నాయుడుపాలెం గ్రామానికి చెందిన గుములూరి రమణ(35) ఇనుపరాడ్డుతో కొమరవోలు గ్రామానికి చెందిన కాశిపల్లి రాంబాబు (49)పై దాడి చేశాడు. దీంతో తీవ్రంగా గాయపడిన రాంబాబుని కుటుంబీకులు విశాఖ కేజీహెచ్‌కు తరలించగా అక్కడ చికిత్స పొందుతూ సోమవారం రాంబాబు మృతి చెందాడు. దీనిపై మృతుడి భార్య కాశిపల్లి మణి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ ఎల్.సురేష్ కేసు నమోదు చేశారు. వివరాలివి. కొమరవోలు గ్రామానికి చెందిన కాశిపల్లి రాంబాబు ఈ నెల 15 న నర్సీపట్నం నుంచి ప్రయాణికులను తన ఆటోలో తీసుకొని రోలుగుంట వైపు వస్తున్నాడు. ఆదే మార్గంలో కె.నాయుడుపాలెం గ్రామానికి చెందిన గుములూరి రమణబాబు లారీ డ్రైవ్ చేసుకుంటూ ఆటో వెనక వస్తూ ఆటోను ఓవర్‌టేక్ చేయగా, ఆటోకి తగిలి సైడ్ మిర్రర్ పోయింది. దీంతో ఆటోను దాటి వెళుతూ గ్లాస్ కూడా డామేజి చేయడంతో రాంబాబు లారీ డ్రైవర్‌పై ఆగ్రహం వ్యక్తం చేశాడు. అయితే నిండుగొండ కూడలి దాటిన తరువాత స్టోన్ క్రషర్‌కు వెళ్లే మట్టిరోడ్డు మలుపులో లారీని ఆపిన రమణ రాంబాబుతో వాగ్వాదానికి దిగాడు. వాగ్వాదం పెరిగి రమణ ఇనుపరాడ్డుతో ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన రాంబాబుపై దాడి చేశాడు. దీంతో తీవ్రంగా గాయపడిన రాంబాబును కుటుంబ సభ్యులు నర్సీపట్నం ఆస్పత్రిలో చేర్చారు. వైద్యుల సూచనల మేరకు విశాఖ కేజీహెచ్‌కు తరలించగా అక్కడ చికిత్స పొందుతూ రాంబాబు సోమవారం మృతి చెందాడు. మృతుడి భార్య మణి ఫిర్యాదు మేరకు ఎస్ఐ ఎల్.సురేష్ కేసు నమోదు చేశారు. అనకాపల్లి డీఎస్పీ ఎస్.అప్పలరాజుకు సమాచారం ఇచ్చారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని, నిందితుడు పరారీలో ఉన్నాడని గాలిస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

విద్యుత్ షాక్‌తో నేపాల్ యువకుడి మృతి



మృతి చెందిన జివన్ మగర్

కె.కోటపాడు : కింతాడ గ్రామంలో సి.ఐ.బి.ఎస్ కళాశాలలో బైబిల్ కోర్సు నేర్చుకుంటున్న నేపాల్‌కు చెందిన జీవన్ మగర్ (28) విద్యుత్ షాక్‌తో సోమవారం మృతి చెందాడు. కళాశాలలో రెసిడెన్షియల్ విద్యార్థిగా జీవన్ బైబిల్ విద్యను అభ్యసిస్తున్నాడు. సోమవారం ఉదయం స్నానం చేసేందుకు జీవన్ మగర్ మోటారును ఆన్ చేశాడు. మోటారు నుంచి నీరు రాకపోవడంతో మోటారు ఎమైందోనని చూసి మోటారును పట్టుకున్నారు. ఆ సమయంలో మోటారు వెంబడి విద్యుత్ ప్రసరణ జరుగుతుండడంతో వెంటనే విద్యుత్ షాక్‌కు గురయి అపస్మారక స్థితికి చేరుకున్నాడు. దీంతో స్నేహితుడు ప్రదీప్ సాగర్ కళాశాల సిబ్బందికి సమాచారం ఇచ్చి మెరుగైన వైద్యం కోసం కె.కోటపాడు ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రికి వెళ్లేసరికి జీవన్ మగర్ మృతి చెందినట్టు నిర్ధారించాడు. జరిగిన ప్రమాద సమాచారాన్ని మృతుడు స్నేహితుడైన ప్రదీప్ సాగర్ కె.కోటపాడు పోలీసులకు తెలియజేశాడు. ఎస్ఐ లక్ష్మీనారాయణ కేసు నమోదు చేసి విచారణ నిర్వహిస్తున్నారు.

మినీ టెక్స్‌టైల్ పార్క్ ఏర్పాటు చేయాలి

అగనంపూడి: ఉత్తరాంధ్రలో నేషనల్ ఇండస్ట్రీస్ డెవలప్‌మెంట్ కో-ఆపరేటివ్ ఫెడరేషన్ లిమిటెడ్ (నిడ్‌కాఫ్) ద్వారా మినీ టెక్స్‌టైల్ పార్క్‌ను ఏర్పాటు చేయాలని ఆలిండియా బ్రాహ్మణ ఫెడరేషన్ (ఏబీఎఫ్) రాష్ట్ర కన్వీనర్ ధర్మాల వ్యాసశర్మ నిడ్‌కాఫ్ వైస్ చైర్మన్ వినోద్‌కుమార్ గౌడ్‌ను కోరారు.

బీఎన్ రోడ్డు, వంతెన పనులు పూర్తి చేయండి



విజయరామరాజుపేట వద్ద తాచేరు వంతెనను పరిశీలిస్తున్న ఎంపీ సీఎం రమేష్

బుచ్చెయ్యపేట : భీమునిపట్నం, నర్సీపట్నం (బీఎన్) రోడ్డులో ఆగిపోయిన రోడ్డు పనులు, వంతెన నిర్మాణ పనులు వేగవంతంగా పూర్తి చేసి ప్రజలకు రవాణా సదుపాయం కల్పించాలని అనకాపల్లి ఎంపీ సీఎం రమేష్ అధికారులకు సూచించారు. సోమవారం ఆయన సగంలో ఆగిపోయిన బీఎన్ రోడ్డు పనులు, విజయరామరాజుపేట వద్ద కూలిన తాచేరు వంతెనను ఆయన ఎమ్మెల్యే కె.ఎస్.ఎన్.ఎస్ రాజు, ఆర్అండ్‌బీ ఎస్ఈ ధనుంజయ్‌లతో కలిసి పరిశీలించారు. సగంలో ఆగిపోయిన రోడ్డు పనులు వల్ల వర్షాలకు గోతుల్లో నీరు చేరి బురద రోడ్లతో ప్రజలు రవాణాకి ఇబ్బందులు పడుతున్నారని, గతంలో జరుగుతున్న రోడ్డు పనులు ఆపొద్దని వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. రోడ్డు నిర్మాణ పనులు, తాచేరు, పెద్దేరు వంతెన నిర్మాణాలకు అంచనాలు తయారు చేసి పనులు ప్రారంభించాలన్నారు.

అధిక ఫీజులు వసూలు చేస్తే గుర్తింపు రద్దు

- డీఈవో వెంకటలక్ష్మమ్మ

నర్సీపట్నం: అధిక ఫీజులు వసూలు చేసే స్కూళ్ల గుర్తింపును రద్దు చేస్తామని జిల్లా విద్యాశాఖాధికారి ఎం.వెంకటలక్ష్మమ్మ హెచ్చరించారు. సోమవారం నర్సీపట్నం వచ్చిన ఆమె స్థానిక విలేకరులతో మాట్లాడారు. అధిక ఫీజులు వసూలు చేసినా, స్కూళ్లలో పుస్తకాలు విక్రయించినా అలాంటి స్కూళ్ల గుర్తింపును రద్దు చేయటం తప్పదన్నారు. నిబంధనలకు విరుద్ధంగా అధిక ఫీజులపై అందిన ఫిర్యాదుల మేరకు మండలాల వారీగా స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

ఏజెన్సీ టీచర్లను మైదాన ప్రాంతాలకు బదిలీ చేయాలని వినతి



అనకాపల్లిలో యూటీఎఫ్ రాష్ట్ర నాయకులకు వినతి పత్రం అందజేస్తున్న ఉమ్మడి విశాఖ జిల్లా ప్రతినిధులు



వడ్డాదిలో విలేకరులతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ రఘువర్మ

కశింకోట: ఏజెన్సీ ప్రాంతంలో పనిచేస్తున్న ఉపాధ్యాయులను మైదాన ప్రాంతాలకు బదిలీ చేయడానికి చర్యలు తీసుకోవాలని జిల్లా యూటీఎఫ్ ప్రధాన కార్యదర్శి గొంది చినబ్బాయి కోరారు. ఉమ్మడి విశాఖ జిల్లా ప్రతినిధులతో కలిసి సోమవారం యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు నక్కా వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి కె.ఎస్.ఎస్.ప్రసాద్‌లకు అనకాపల్లిలో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 2023 జూన్‌లో జరిగిన బదిలీల్లో ఏజెన్సీ ప్రాంతానికి వెళ్లిన 400 మంది ఉపాధ్యాయులను మైదాన ప్రాంతాలకు బదిలీ చేయాలన్నారు. జీవో నెంబర్ 3 రద్దు కావడం, జీవో నెంబర్ 117 అమలు కావడం వల్ల ఉపాధ్యాయులు ఏజెన్సీ ప్రాంతానికి బదిలీ అయి ఇబ్బందులను ఎదుర్కొంటున్నారన్నారు. వీరిలో ఎక్కువమంది మహిళా ఉపాధ్యాయులు రిటైర్‌మెంట్ దశలో ఉన్నారన్నారు. మెగా డీఎస్సీలో పేర్కొన్న ఖాళీల్లో ఏజెన్సీలో పనిచేస్తున్న ఉపాధ్యాయులను మైదాన ప్రాంతాల్లోకి బదిలీ చేయాలని, ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు.

'117 జీవోను ప్రభుత్వం రద్దు చేయాలి'

బుచ్చెయ్యపేట : ప్రభుత్వం 117 జీఓను రద్దు చేయాలని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పాకలపాటి రఘువర్మ కోరారు. సోమవారం సాయంత్రం ఆయన వడ్డాదిలో స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ఏజెన్సీ ప్రాంతాలకు బదిలీ చేసిన మైదాన ఉపాధ్యాయులను తిరిగి మైదాన ప్రాంతాలకు బదిలీ చేయాలన్నారు. మోడల్ స్కూల్లో పని చేస్తున్న ఉపాధ్యాయులకు ప్రభుత్వ పాఠశాలలో పని చేస్తున్న ఉపాధ్యాయుల్లాగే సర్వీస్ రూల్స్ అమలు చేయాలన్నారు. కస్తూర్బా పాఠశాలలో పని చేస్తున్న ఉపాధ్యాయులకు మినిమం టైం స్కేల్‌ను అమలు చేయాలని అన్నారు. రెసిడెన్షియల్ పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులకు 62 ఏళ్ల వరకు సర్వీస్‌ను పొడిగించాలన్నారు. ఉపాధ్యాయులకు బోధనేతర పనులు అప్పగించకుండా ప్రభుత్వం అన్ని పాఠశాలల్లో మౌలిక వసతులను మెరుగు పరచాలన్నారు. ఏపీటీఎఫ్ రాష్ట్ర మాజీ కార్యదర్శి వెంకటపతిరాజు, ఉపాధ్యాయులు త్రినాథ్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

లంకెలపాలెం..దాటాలంటే గగనం

- అనకాపల్లి వైపు రహదారిలో కిలోమీటర్ల మేర వాహనాలు
- సిగ్నల్ పాయింట్ దాటాలంటే 10-15 నిమిషాల నిరీక్షణ
- హడలిపోతున్న వాహనచోదకులు
- ఫ్రీ లెఫ్ట్ ఏర్పాటుకు వినతులు



అనకాపల్లి నుంచి గాజువాక వెళ్లే మార్గంలో సిగ్నల్ పాయింట్ వద్ద భారీగా నిలిచిన వాహనాలు



సిగ్నల్ పాయింట్‌కు చాలా దూరంలో నిలిచిపోయిన వాహనాలు

అగనంపూడి: లంకెలపాలెం జంక్షన్ అంటే వాహనచోదకులు హడలిపోతున్నారు. అనకాపల్లి నుంచి గాజువాక వైపు వచ్చే మార్గంలో వాహనదారులు సిగ్నల్ పాయింట్ దాటాలంటే కనీసం రెండు సిగ్నల్స్ వరకు వేచి ఉండాల్సిందే. ప్రతీ రోజూ ఇదే పరిస్థితి ఉండడంతో వాహనచోదకులకు అగచాట్లు తప్పడం లేదు. ఏ సమయంలో అయినా కిలోమీటర్ మేర ట్రాఫిక్ నిలిచిపోయే పరిస్థితి ఉండడంతో ప్ర యాణికులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. కూడలిలో ఈ మార్గం వద్ద రహదారి ఇరుకుగా కుదించుకుపోయి ఉంది. దీంతో ఈ మార్గంలో వాహనాల రద్దీ ఎక్కువగా ఉండడంతో ఒక సారి సిగ్నల్ పూర్తి చేసుకుని, రెండో సారి సిగ్నల్ పూర్తయ్యేటప్పటికీ కూడా కూడలి నుంచి వెళ్తామనే నమ్మకం వాహనచోదకుల్లో లేకపోవడంతో తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు.

కనీసం 10-15 నిమిషాల నిరీక్షణ

ఒకసారి సిగ్నల్ క్లియర్ అవడానికి కనీసం ఆరు నిమిషాల సమయం పడుతుండడంతో, ఒక వాహనం కూడలి దాటాలంటే కనీసం రెండు విడతలు సిగ్నల్ పాయింట్ వద్ద వేచి ఉండాల్సి వస్తోంది. దీంతో కనీసం పది నుంచి 15 నిమిషాల సమయం పడుతుండడంతో వాహనాలు కూడలి వద్ద భారీగా నిలిచిపోయే పరిస్థితి ఎదురవుతోంది.

ఫ్రీలెఫ్ట్‌తో సమస్య పరిష్కారం

గాజువాక నుంచి అనకాపల్లి వైపు వెళ్లే వాహనాలకు (ఫార్మాసిటీకి వెళ్లేందుకు వీలుగా) ఫ్రీ లెఫ్ట్ ఏర్పాటు చేయడంతో ఈ మార్గంలో వాహనాల రద్దీ తగ్గింది. నేరుగా అనకాపల్లి వైపు వెళ్లే వాహనాలే వేచి ఉండాల్సి రావడంతో ట్రాఫిక్‌కు ఇబ్బంది లేకుండా పోయింది. అదే అనకాపల్లి వైపు నుంచి వచ్చే వాహనాలకు మాత్రం ఫ్రీ లెఫ్ట్ సౌకర్యం ఏర్పాటు చేయకపోవడంతో ట్రాఫిక్ చక్రబంధంలో వాహనచోదకులు చిక్కుకుంటున్నారు. నగర పోలీస్ కమిషనర్, జీవీఎంసీ, ఎన్‌హెచ్ఏఐ అధికారులు సమన్వయంతో వ్యవహరించి ఈ మార్గంలో కూడా ఫ్రీ లెఫ్ట్ ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

ప్రతి రోజూ నిరీక్షణే..

లంకెలపాలెం కూడలి వద్ద ఉదయం, సాయంత్రం వేళల్లో ప్రతీ రోజూ ట్రాఫిక్ నిలిచిపోతోంది. మామూలు సమయాల్లో అరకిలోమీటరు మేర వాహనాలు బారులు ఉంటున్నాయి. ఎ ప్పుడూ ట్రాఫిక్‌లో చిక్కుకుపోవడమే. అనుకు న్న సమయానికి గమ్యానికి చేరగలమా అనే టెన్షన్ పెరిగిపోతోంది. ట్రాఫిక్ ఇబ్బందులు తొలగించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలి.

– ఆర్.నాగేశ్వరరావు, లంకెలపాలెం

ఫ్రీ లెఫ్ట్ ఏర్పాటు చేయాలి

అనకాపల్లి వైపు నుంచి లంకెలపాలెం కూడలి వద్దకు వచ్చేటప్పటికీ ట్రాఫిక్ సమస్య తలెత్తుతోంది. కూడలి వద్ద రహదారి ఇరుగ్గా ఉండటంతో వాహనాలు నిలిచిపోతున్నాయి. ఒక్కో సారి మరిడిమాంబ గుడి దాటి వాహనాలు బా రులు తీరుతున్నాయి.ఈ మార్గంలో ఉదయం, సాయంత్రం వేళల్లో ప్రయాణం అంటే ఆలోచించాల్సి వస్తోంది. అనకాపల్లి వైపు నుంచి వచ్చే మార్గంలో ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా ఫ్రీ లెఫ్ట్ ఏర్పాటు చేయాలి. జిల్లా ఉన్నతాధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలి.

–డి.బ్రహ్మయ్య, గంగిరెడ్లకాలనీ

క్లుప్తంగా

త్రిపురాంతక స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు



శివాలయంలో నిర్వహిస్తున్న అన్నసమారాధన

కశింకోట: కశింకోటలోని పురాత సర్వమంగళాంబ సమేత త్రిపురాంతక స్వామి ఆలయం (శివాలయం)లో సోమవారం అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామిని దర్శించుకున్నారు. ఆలయ అర్చకుడు వి.బాబ్జీ, వి.కృష్ణల ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు నిర్వహించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నసమారాధన చేశారు.

అనారోగ్యంతో ప్రధానోపాధ్యాయిని మృతి

కశింకోట: కశింకోటలోని 2వ బాలికల ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయిని ఇ.సత్యవతి(50) అనారోగ్యంతో సోమవారం మృతిచెందారు. ఆమెకు భర్త కామేశ్వరరావు, ఇద్దరు ఆడ పిల్లలున్నారు. ఎంఈవో మూర్తి, పలువురు ఉపాధ్యాయులు సత్యవతి మృతదేహాన్ని సందర్శించి, శ్రద్ధాంజలి ఘటించారు. ఆమె కుటుంబ సభ్యులను ఓదార్చి సంతాపం తెలిపారు.

'హెల్పింగ్ హ్యాండ్స్' ప్రారంభం

మునగపాక: మునగపాకలో ఆదివారం రాత్రి హెల్పింగ్ హ్యాండ్స్ లోగో ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. కూటమి నేతలు టెక్కలి పరశురామ్,దాడి ముసిలినాయుడు తదితరులు లోగోను ఆవిష్కరించి మాట్లాడారు. ప్రజలకు ఎటువంటి సమస్య ఎదురైనా వాటి పరిష్కారానికి హెల్పింగ్ హ్యాండ్స్ దోహదపడుతుందన్నారు. ఆపదలో ఉన్న వారికి తమవంతు సాయం అందించేలా పాటుపడాలన్నారు. విద్యావేత్త కోరుకొండ గోపీ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో పెంటకోట విజయ్, ఆడారి శ్రీకాంత్, శరగడం జగన్, విల్లూరి నూక నరసింగరావు, ఎ.వి. సత్యనారాయణ, డొక్కా నాగభూషణం, కె.పి.రావు , దాడి శివ పాల్గొన్నారు.

తాండవ రైతు ఉత్పత్తిదారుల సంఘం సమావేశం

పాయకరావుపేట: తాండవ వ్యాలీ ఉద్యాన వన, వ్యవసాయ రైతు ఉత్పత్తి దారుల పరస్పర సహాయ సహకార సంఘం సమావేశం మండలంలో గల సత్యవరం గ్రామంలో నిర్వహించారు. సంఘం అధ్యక్షుడు విశ్వనాధుని వెంకట సత్యనారాయణ అధ్యక్షతన జరిగిన సమావేశంలో సంఘం ఆధ్వర్యంలో రైతులకు క్రిమి సంహారక మందుల వ్యాపారం ప్రారంభించడం, హార్టికల్చర్ డిపార్ట్మెంట్ ద్వారా కలెక్షన్ సెంటర్లు, ప్యాకింగ్ నిర్మాణం, మహిళల జీవనోపాధి పెంపకంలో భాగంగా వివిధ రంగాల్లో మహిళలకు శిక్షణ ఇచ్చి నైపుణ్యాలను పెంచడం తదితర అంశాలపై సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో సంఘం కార్యదర్శి జి.వి.వి. సత్యనారాయణ, పలువురు రైతులు పాల్గొన్నారు.

బెల్లం ధరలు



అనకాపల్లి మార్కెట్‌కు సోమవారం 134 బెల్లం దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
మొదటి రకం	4,800	5,170
రెండో రకం	4,150	4,430
మూడో రకం	3,530	4,000

అనకాపల్లి సినిమాలు

మహారాజ	: రాజా
మనమే	: సత్యనారాయణ స్క్రీన్-1
మ్యూజిక్‌షాప్ మూర్తి	: సత్యనారాయణ స్క్రీన్-2
భజే వాయు వేగం	: షిర్డిసాయి
లవ్ మౌళి	: పర్తిసాయి
సత్యభామ	: వెంకటేశ్వర
గ్యాంగ్ ఆఫ్ గోదావరి	: శ్రీసత్య
హరోం హర	: రామచంద్ర

ప్రతి కార్యకర్తకు అండగా ఉంటా



నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశంలో మాట్లాడుతున్న భరత్‌కుమార్



సమావేశంలో పాల్గొన్న వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు

- ప్రజలకు సేవ చేసిన జగన్ ఓటమి కలచివేసింది
- నియోజకవర్గ స్థాయి సమావేశంలో మలసాల భరత్‌కుమార్ భావోద్వేగం

తుమ్మపాల: రాష్ట్రంలో పేద ప్రజలకు అద్భుతమైన సంక్షేమాన్ని అందించిన తమ పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఓటమి తనను ఎంతో కలచివేసిందని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్ అన్నారు. ఎన్నికల్లో తాను ఓడిపోయినందుకు బాధగా లేదని, ప్రజలకు ఎంతో సేవ, మేలు చేసిన జగనన్న ఓడిపోవడం ఎంతో ఆవేదనను కలిగిస్తోందన్నారు. పట్టణంలోని పార్టీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన నియోజకవర్గ విస్తృత స్థాయి నాయకులు, కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ భావోద్వేగానికి గురయ్యారు. పార్టీ పెట్టినప్పటి నుంచి నేటి వరకు గెలుపోటములతో సంబంధం లేకుండా కేవలం జగన్‌మోహన్‌రెడ్డి సైన్యంగానే పనిచేస్తున్నారన్నారు. గడిచిన ఐదేళ్లలో కూడా కార్యకర్తల ప్రయోజనాల కన్నా ప్రజల సంక్షేమమే ముఖ్యమనేలా పాలన జరిగిందని గుర్తు చేశారు. ఓటమి తరువాత ప్రభుత్వంలో పలు వ్యవస్థలతోనే లోపాలు అంటూ సాకులుగా చూపుతున్నారని, వాటిని పట్టించుకోకుండా అందరితో కలిసి 2029 ఎన్నికల్లో పార్టీ గెలుపు కోసం పనిచేయాలని వైఎస్ జగన్ చెప్పారన్నారు.

2029లో మళ్లీ జగనే వస్తారు..

ప్రతి కార్యకర్తకు తాను అండగా ఉంటానని మలసాల భరత్‌కుమార్ భరోసా ఇచ్చారు. పార్టీ కోసం పనిచేసిన వారితోపాటు గడిచిన ఐదు నెలల్లో కేవలం తన గెలుపు కోసం శ్రమించిన ప్రతి ఒక్కరిని కూడా గుర్తిస్తానన్నారు. ప్రజల సమస్యలపై రానున్న ఐదేళ్లు పోరాడాలని కోరారు. ఓటమికి గల కారణాలను బేరీజు వేసుకుంటూ వాటిని సరిదిద్దుకుని ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. గ్రామాల్లో ప్రజలకు ప్రతి కార్యకర్త అందుబాటులో ఉండాలని సూచించారు. భవిష్యత్‌లో చేపట్టాల్సిన కార్యక్రమాలపై నాయకులతో చర్చించి ఎప్పటికప్పుడు నిర్ణయాలు తీసుకుంటామన్నారు. ఓటమి చెందినప్పటికి కార్యకర్తల్లో మనోస్థైర్యం నింపడానికి మరిన్ని కార్యక్రమాలు చేపడతామన్నారు. ప్రభుత్వంలో లోపాలను ప్రశ్నిస్తూ.. నిరంతరం ప్రజల్లోనే ఉంటానన్నారు. 2029లో మళ్లీ జగనన్నే ముఖ్యమంత్రిగా వస్తారని, ఆ దిశగా ఇప్పటి నుంచి అడుగులు వేస్తామని, తనను నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థిగా ప్రకటించిన నాటి నుంచి దాదాపు ఐదు నెలలు పాటు తనను గెలిపించాలనే లక్ష్యంతో శ్రమించిన ప్రతి కార్యకర్తకు భరత్‌కుమార్ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎంపీ బి.వి.సత్యవతి, ఏపీ ఇన్ ల్యాండ్స్ వాటర్‌వేస్ అథారటీ మాజీ చైర్మన్ దంతులూరి దిలీప్‌కుమార్, పార్టీ పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకీరామరాజు, ఎంపీపీలు గొర్లి సూరిబాబు, గున్నయ్యనాయుడు లక్ష్మి, జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ భీశెట్టి సత్యవతి, పార్టీ నాయకులు జాజుల రమేష్, కొణతాల మురళీ, జెడ్పీటీసీ జోసఫ్, ఆయా గ్రామాల సర్పంచ్, ఎంపీటీసీలు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కన్యకా పరమేశ్వరి సన్నిధిలో సామూహిక వ్రతాలు



అనకాపల్లి కన్యకా పరమేశ్వరి ఆలయంలో అనఘాష్టమి వ్రతాలు నిర్వహిస్తున్న మహిళలు



అమ్మవారిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే కొణతాల

కశింకోట: అనకాపల్లిలోని కన్యకా పరమేశ్వరి ఆలయంలో అమ్మవారి ప్రతిష్ఠా శత జయంత్యుత్సవాల్లో భాగంగా సోమవారం మహిళలు సామూహికంగా అనఘాష్టమి వ్రతం నిర్వహించారు. చింతామణి దత్త క్షేత్రం ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ అమ్మవారిని దర్శించి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ సభ్యులు ఆయనకు దుశ్శాలువా కప్పి జ్ఞాపికను అందజేసి ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ప్రతిష్ఠ శత జయంతి ఉత్సవాల కమిటీ చైర్మన్ కోరుకొండ బుచ్చిరాజు, సహ చైర్మన్ డాక్టర్ గ్రంధి శేషుకుమార్, ఆలయ అధ్యక్షుడు బిల్లపాటి కృష్ణకుమార్, కార్యదర్శి కొరుప్రోలు జగదీశ్వరరావు, కోశాధికారి శ్రీధరాల సోమరాజు, ఉత్సవ కమిటీ చైర్మన్ వుప్పల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పెళ్లిరాట వేడుక

తుమ్మపాల: పట్టణంలోని గవరపాలెం శతకంపట్టు శ్రీ కనకదుర్గ అమ్మవారి ఆలయంలో సప్తమ వార్షికోత్సవం సందర్భంగా సోమవారం శ్రీదుర్గా మల్లేశ్వర స్వామి వారి పెళ్లిరాట ఘనంగా జరిగింది. ఈ నెల 17, 18, 19 తేదీల్లో ఘనంగా ఈ వేడుకలు జరుగుతాయని ఆలయ వ్యవస్థాపకుడు పి.వి.రమణ తెలిపారు. బోగాపురపు వెంకటరమణ(బాబు) ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు ప్రత్యేక పూజా కార్యక్రమాలు జరుగుతాయన్నారు. కాండ్రేగుల నాయుడు భాగ్యలక్ష్మి దంపతుల సౌజన్యంతో పొలమరశెట్టి వెంకట అప్పారావు వాణి, బుద్ధ సంతోష్ హేమ, పాలిమేర శ్రీను జయ దంపతులు పెళ్లిరాట పూజ నిర్వహించినట్లు చెప్పారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ కర్రి సన్యాసినాయుడు, ఆలయ కమిటీ, శ్రీ గౌరీపరమేశ్వరుల కమిటీ, శ్రీ మరిడిమాంబ కమిటీల సభ్యులు పాల్గొన్నారు.



దుర్గా మల్లేశ్వర స్వామి పెళ్లిరాట వేస్తున్న కమిటీల సభ్యులు, భక్తులు

భక్తిశ్రద్ధలతో బక్రీద్

కశింకోట: మండలంలోని ముస్లింలు బక్రీద్ పండగను సోమవారం భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఈ సందర్భంగా స్థానిక పురాతన జామియా మసీదు, నూరి మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఇమాం జెడ్ రెహమాన్ బక్రీద్ పండగ విశిష్టతను తెలియజేశారు. ఇస్మాయల్ త్యాగానికి ప్రతీకగా ఈ పండగను జరుపుకుంటారన్నారు. ముస్లింలతో ప్రత్యేక ప్రార్థనలు జరిపించారు. నరసింగబిల్లిలోని మసీదులో బక్రీద్ ప్రార్థనలు నిర్వహించారు.

త్యాగానికి ప్రతీక

పరవాడ: మండలంలో బక్రీద్ పర్వదినాన్ని ముస్లింలు ఘనంగా నిర్వహించారు. పరవాడ, గొల్లగుంట, వాడచీపురుపల్లి, ఎన్టీపీసీ ప్రాంతాల్లోని మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. త్యాగ నిరతికి బక్రీద్ నిదర్శనమని ముస్లిం పెద్దలు పేర్కొన్నారు. ఒకరికొకరు స్వీట్లు పంచుకొని శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు.

యలమంచిలి రూరల్ : త్యాగానికి ప్రతీకగా నిలిచే బక్రీద్ వేడుకలను యలమంచిలి పట్టణం, మండలంలో రేగుపాలెం గ్రామంలో సోమవారం ముస్లింలు భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు. బక్రీద్‌ను పురస్కరించుకుని ఉదయాన్నే ముస్లింలు నూతన వస్త్రాలు ధరించి ఈద్గాలు, మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. బక్రీద్ ప్రాముఖ్యతను మత పెద్దలు వివరించారు. త్యాగ నిరతిని స్ఫూర్తిగా తీసుకోవాలని సూచించారు.కొందరు ముస్లింలు ఖబ్రస్తాన్ వద్ద పూర్వీకుల సమాధులపై పుష్పాలు చల్లి నివాళి అర్పించారు.



కశింకోట నూరి మసీదులో ప్రత్యేక ప్రార్థనలు



నమాజ్ చేస్తున్న ముస్లింలు

ఓం నమో వేంకటేశాయ



వజ్ర కవచం, తులసి, పూల మాలలతో వెంకన్న అలంకరణ



మూలవిరాట్‌కు క్షీరాభిషేకం నిర్వహిస్తున్న అర్చకులు



కలశాలకు పూజలు నిర్వహిస్తున్న అర్చకులు, భక్తులు

- కశింకోట వెంకన్నకు విశేష అభిషేకాలు

కశింకోట: కశింకోటలోని వేంకటేశ్వర స్వామి ధ్యాన మందిరంలో సోమవారం స్వామికి క్షీర, పంచామృతాభిషేకాలు ఘనంగా నిర్వహించారు. జేష్ఠ శుద్ధ ఏకాదశిని పురస్కరించుకుని చేపట్టిన కల్యాణోత్సవాల్లో భాగంగా మూడు గంటలకు పైగా కార్యక్రమాన్ని జరిపారు. ఆలయ అర్చకుడు రేజేటి రామచరణాచార్యులు ఆధ్వర్యంలో మొదటగా గణేష్ పూజ, విశ్వక్షేన పూజ నిర్వహించారు. అనంతరం నవ కలశాలను ఏర్పాటు చేసి వాటిలో ఒక్కో దానిలో భక్తులు సమకూర్చిన పాలు, పెరుగు, నెయ్యి, తేనె, పంచదార, పసుపు, కుంకుమ, చందనం, నగదు నాణేలు వేర్వేరుగా నింపి వేద మంత్రాల నడుమ శాస్త్రోక్తంగా పూజలు చేశారు. అనంతరం ఆలయంలోని వేంకటేశ్వరస్వామి మూలవిరాట్‌కు క్షీరాభిషేకం, తర్వాత పంచామృత అభిషేకం అంగరంగ వైభవంగా నిర్వహించారు. చివరిగా నాణేలతో అభిషేకించారు. అనంతరం స్వామిని వజ్ర కవచాలంకృతులను చేశారు. పూలమాలలు, తులసి మాలలతో అందంగా అలంకరించారు. విష్ణు సహస్ర నామార్చన చేశారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని ఆద్యంతం తిలకించారు. పూజా కార్యక్రమాల అనంతరం తీర్థప్రసాదాలు అందజేశారు.

ఏకగ్రీవంగా పాల సొసైటీ డైరెక్టర్ల ఎన్నిక



నూతనంగా ఎన్నికైన డైరెక్టర్లను అభినందిస్తున్న గ్రామ పెద్దలు, సొసైటీ సభ్యులు

సబ్బవరం: మండలంలోని బంగారమ్మపాలెంలో విశాఖ డెయిరీ పాల ఉత్పత్తిదారుల సంఘంలో ఇద్దరు డైరెక్టర్లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సొసైటీలోని ఇద్దరు డైరెక్టర్ల పదవీకాలం ముగియడంతో వారి స్థానంలో నూతన డైరెక్టర్లను ఎంపిక చేసుకోవడానికి సొసైటీ అధ్యక్షుడు దొడ్డి సోమేశ్వరరావు అధ్యక్షతన సోమవారం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. పాడి రైతులు దొడ్డి రామప్పడు,మద్దాల భవానీలను డైరెక్టర్లుగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సమావేశంలో గ్రామ పెద్దలు దాడి కన్నంనాయుడు, దొడ్డి ప్రకాష్,దాడి త్రిమూర్తులు,సొసైటీ కార్యదర్శి సూరిశెట్టి రామకృష్ణ, శిలపశెట్టి మాలినాయుడు,దొడ్డి రాజకోటి,సూరిశెట్టి రమణ, దొడ్డి అర్జున తదితరులు పాల్గొన్నారు.

సుర్రుమన్న సూరీడు



కశింకోటలో జన సంచారం లేక బోసిపోయిన పంచాయతీ ప్రధాన రహదారి

కశింకోట: మండలంలో సోమవారం సూర్యుడు సుర్రుమన్నాడు. రుతుపవనాలు ప్రవేశించినా ఎండ తీవ్రత తగ్గలేదు. అధిక ఉష్ణోగ్రతతో ప్రజలు సతమతమయ్యారు. ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు బయట తిరగడానికి జనం వెనుకడుగు వేశారు. దాదాపు ఇళ్లకే పరిమితమయ్యారు. దీంతో కశింకోటలోని ప్రధాన రహదారులు, వీధులు జన సంచారం లేక వెలవెలబోయాయి. సాయంత్రం వాతావరణం చల్లబడటంతో యథావిధిగా తమ కార్యకలాపాల నిర్వహణలో నిమగ్నమయ్యారు.

ముగిసిన శ్రీవిద్య ప్రారంభిక కోర్సు



గురుమాత అన్నపూర్ణమ్మతో శ్రీవిద్య కోర్సు నేర్చుకున్న విద్యార్థులు

సబ్బవరం: ప్రముఖ ఆధ్యాత్మిక క్షేత్రం దేవీపురంలోని సహస్రాక్షి రాజరాజేశ్వరీదేవి పీఠంలో నాలుగు రోజుల పాటు నిర్వహించిన శ్రీవిద్య ప్రారంభిక కోర్సు సోమవారంతో ముగిసింది. ఈ నెల 14 నుంచి నిర్వహించిన ఈ కోర్సులో చెన్నై,కోయంబత్తూర్,ఆగ్రా,కోల్‌కతా బెంగళూర్,రాయపూర్,ఢిల్లీతో పాటు యూరప్‌లోని లాత్వియా నుంచి వచ్చిన విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు. కోర్సులో భాగంగా ప్రధాన అంశాలైన మంత్ర సాధన,యంత్ర పూజలు,తర్పణాల థియరీతో పాటు ఆచరణ పూర్వకంగా ఉపాసనా విధానాలను వివరించారు. తమంతట తాము హోమాలు చేసుకోగలిగే స్థాయిలో శిక్షణ ఇచ్చారని ఆచార్యులతో పాటు గురుమాత అన్నపూర్ణమ్మకు విద్యార్థులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు కందర్ప ప్రభాకర్, ఆచార్యులు మూర్తి రాధ,కందర్ప రమ,వి. షణ్ముఖేశ్వరన్ శర్మ తదితరులు పాల్గొన్నారు.

సన్యాసమ్మతల్లి ఒడ్డు పండగ నేడు

దేవరాపల్లి: స్థానిక గ్రామ దేవత శ్రీ సన్యాసమ్మ తల్లి ఒడ్డు పండగను మంగళవారం ఘనంగా నిర్వహించనున్నారు. ఆలయ ధర్మకర్త వరదపురెడ్డి లలితానాయుడు ఆధ్వర్యంలో ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఆలయాన్ని ప్రత్యేకంగా ముస్తాబు చేశారు.

వైభవంగా శివపార్వతుల కల్యాణోత్సవం



కల్యాణోత్సవంలో శివపార్వతులు



కల్యాణాన్ని తిలకిస్తున్న భక్తులు

కశింకోట: కశింకోట కుమ్మరి వీధిలో వెలసిన ఉమా సాంబశివుని ఆలయంలో సోమవారం రాత్రి శివపార్వతుల కల్యాణోత్సవం వైభవంగా నిర్వహించారు. జేష్ఠ శుద్ధ ఏకాదశిని పురస్కరించుకొని శివపార్వతుల ఉత్సవ విగ్రహాలను అందంగా అలంకరించి వేదికపై నిలిపి శాస్త్రోక్తంగా వేద మంత్రాల నడుమ కల్యాణం జరిపారు. గణేష్ పూజ, యజ్ఞోపవీత ధారణ, కన్యాదానం, జీలకర్ర, శుభ ముహూర్తాన బెల్లం పెట్టుట, మాంగళ్యధారణ, తలంబ్రాలు పోయడం తదితర ఘట్టాలతో ఆలయ అర్చకుడు వెయిదళముల ప్రసాద్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. భక్తులు కల్యాణాన్ని తిలకించి ఆనంద పరవశులయ్యారు. ఉదయం ఆలయంలో ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఉపాధి పనులతో కాలువల అభివృద్ధి



వాడ్రాపల్లి కాలువల్లో పేరుకుపోయిన తుప్పల తొలగింపు పనులు పరిశీలిస్తున్న సర్పంచ్ నూకరాజు

మునగపాక: ఉపాధిహామీ పథకం ద్వారా కాలువలు,చెరువులు అభివృద్ధి చెందుతున్నాయని వాడ్రాపల్లి సర్పంచ్ కాండ్రేగుల నూకరాజు అన్నారు. ఉపాధి హామీ పథకంలో భాగంగా వాడ్రాపల్లి ప్రాంతంలోని సాగునీటి కాలువలు, చెరువుల్లో పేరుకుపోయిన తుప్పల తొలగింపు పనులను ఆయన సోమవారం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ఏళ్ల తరబడి తుప్పలతో పేరుకుపోయిన కాలువలను ఉపాధిహామీ పథకం కూలీల ద్వారా అభివృద్ధి చేస్తున్నామన్నారు.

'అందరి సహకారంతో హిందూ ధర్మ పరిరక్షణ'

మాడుగుల రూరల్: హిందూ మత వ్యాప్తికి ప్రతి ఒక్కరు కృషి చెయ్యాలని విశ్వ హిందూ పరిషత్ జిల్లా ప్రధాన కార్యదర్శి జి.శ్రీమన్నారాయణాచార్యులు తెలిపారు. సోమవారం కె.జె.పురం జంక్షన్లోని వేంకటేశ్వర స్వామి ఆలయంలో విశ్వ హిందూ పరిషత్ ఆత్మీయ సమ్మేళనంలో ఆయన భక్తులను ఉద్దేశించి మాట్లాడారు. అన్యమత వ్యాప్తిని అరికట్టడానికి గ్రామ స్థాయిలో కమిటీలు ఏర్పాటు చేయాలని సూచించారు.

సాక్షి

మీరు సాక్షి చందాదారులుగా చేరదలుచుకున్నారా!
లేదా మీకు పేపరు అందటంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయా!
సంప్రదించవలసిన నెంబరు
9966329167, 9912440601

ఎన్నెన్నో వర్ణాలు.. అన్నింట్లో అందాలు



అందమైన రాఖీ పుష్పం



కనువిందు చేస్తున్న గోవా ఫ్లవర్



పువ్వు కాదు ఇవి ఆకులే (అందమైన పువ్వుగా కనిపిస్తున్న ఆకులు)

అడపా దడపా కురుస్తున్న వర్షాలకు రోడ్ల పక్కన మొక్కలు రంగు రంగుల పుష్పాలతో కనువిందు చేస్తున్నాయి. కొన్ని రకాల పువ్వులకు పేర్లు తెలియకపోయినా వాటి అందం కళ్లను కట్టిపడేస్తోంది. చోడవరం పట్టణం, శివార్లలో కొన్ని మొక్కలకు పూసిన పువ్వులు చూపరుల్ని ఆకట్టుకుంటున్నాయి. రాఖీ మాదిరిగా రంగురంగులతో ఓ పుష్పం అందాలు చిందిస్తుంటే.. మరో మొక్క ఆకులే పువ్వులుగా కనిపించి అందరి దృష్టిని తన వేపు తిప్పుకుంటోంది. ఆకు మధ్యలో పువ్వు లేకపోయినా, ఎర్రటి పువ్వు మాదిరిగా సగం ఆకులు రంగును పూసుకోవడంతో ఆకు మధ్యలో పువ్వు విచ్చుకున్నట్లే కనిపిస్తోంది. క్రోటాన్ జాతికి చెందిన గోవా ఫ్లవర్ చూసేవారిని కట్టి పడేస్తోంది. తొలకరి సీజన్లో వర్షాలు కురవడంతో సాధారణ రకాలతో పాటు సువాసన లేని ఇలాంటి పువ్వులు పూస్తాయని స్థానికులు చెప్తున్నారు. వీటిని చూసేందుకు అటుగా వెళ్లే జనం ఆసక్తి చూపుతున్నారు.

– చోడవరం

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
అనకాపల్లి :
9010973030, 9010546644, 9951602901
Office mail : sakshiadvtvsp@gmail.com